క్లుప్తంగా

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



కొల్లాపూర్: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో జిల్లా స్థాయి చెకుముకి పోటీలు శనివారం నిర్వహించారు. సైన్స్ టాలెంట్ టెస్టు ఇంగ్లీష్ మీడియం విభాగంలో స్కాలర్స్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. పృథ్వీరాజ్, మేఘన, రిత్విక్‌సాగర్‌లో మొదటి స్థానంలో నిలిచారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయినట్లు పాఠశాల కరస్పాండెంట్ రాముయాదవ్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ రవికుమార్‌తో పాటు ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

తహసీల్దార్‌కు వినతి



వెల్దండ: మండల కేంద్రంలో క్రీడా మైదానం ఏర్పాటు చేయాలని కోరుతూ శనివారం తహసీల్దార్ రవికుమార్‌కు క్రీడాకారులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సరైన ఆటస్థలాలు లేకపోవడంతో క్రీడాకారులు క్రీడలకు దూరమవుతున్నారని వివరించారు. సర్వే చేయించి క్రీడా మైదానం కోసం స్థలం కేటాయించాలని విన్నవించారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌గౌడ్, శివ, మురళీకృష్ణ, సతీష్, బాబా, మల్లేష్, మేఘనాథ్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరణ

చారకొండ: మండలంలోని జూపల్లి పంచాయతీ కార్యదర్శిగా దేశమోని లక్ష్మి శనివారం బాధ్యతలు చేపట్టారు. వెల్దండ మండలం బైరాపూర్ గ్రామ కార్యదర్శిగా విధులు నిర్వహిస్తు జూపల్లికి బదిలీ అయ్యారు. జూపల్లి పంచాయతీ కార్యదర్శి మల్లేష్ నుంచి లక్ష్మి బాధ్యతలు స్వీకరించారు. గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరారు.

రాష్ట్రస్థాయికి ఎంపిక



తెలకపల్లి: నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో శనివారం నిర్వహించిన జిల్లా స్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభ పరీక్షల్లో గౌరెడ్డిపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ స్థానంలో నిలిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు ఆ పాఠశాల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయుడు మల్లికార్జున్, వెంకటేష్ తెలిపారు. పాఠశాలకు చెందిన వైష్ణవి ప్రథమ స్థానం, లాల్‌కుమార్‌లు ద్వితీయ స్థానం కనబర్చి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. జిల్లా సోషల్ ఫోరం సభ్యులు కృష్ణమోహన్ బహుమతులు అందజేశారు. అనంతరం విద్యార్థులను ఉపాధ్యాయ బృందం అభినందించారు.

ముమ్మరంగా సీపీఎం సభ్యత్వ నమోదు



అచ్చంపేట: నియోజకవర్గంలో సీపీఎం సభ్యత్వ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి పర్వతాలు కోరారు. శనివారం మండలంలోని సింగారంలో సభ్యత్వ నమోదు పునరుద్దరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో సభ్యత్వ నమోదుపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు దేశ్యానాయక్, జిల్లా కమిటీ సభ్యులు మల్లేష్, మాజీ సర్పంచ్ చంద్రు నాయక్, బక్కయ్య, చిన్న అంజనేయులు, బుచ్చన్న, శ్రీను, వెంకటయ్య, లింగమయ్య, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌ఐకి సన్మానం

పెద్దకొత్తపల్లి: మండల ఎస్‌ఐ సతీష్‌ను శనివారం కొల్లాపూర్ నియోజకవర్గ బీసీ సంఘం నేతలు కురుమూర్తి, తిరుపతయ్యలు సన్మానించారు. నాగరాజు, సలీం, రాజు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

పెంట్లవెల్లి: మండల కేంద్రంలో స్థానిక పోలీస్ స్టేషన్‌కు నూతన ఎస్‌ఐ రామన్‌గౌడ్‌ను మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహయాదవ్, మల్లేశ్వరం, మాధవస్వామినగర్ గ్రామాల ప్రజలు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. బాలరాజు, మాజీ సర్పంచ్ తిరుపాటి నాగరాజు, డిష్ రవి, ఉస్సేన్ పాల్గొన్నారు.

కోడేరు: మండల ఎస్‌ఐగా కురుమూర్తి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్‌ఐ శేఖర్‌రెడ్డి నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రానికి బదిలీపై వెళ్లారు.

ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

- 11 కేవీఏ లైన్లతో ఆందోళన
- పట్టించుకోని పాలకులు, అధికారులు



ఉప్పునుంతల ఎస్సీ కాలనీలో



ఉప్పునుంతల శివారులో ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగలు

ఉప్పునుంతల: ఎన్ని ప్రమాదాలు జరుగుతున్నా విద్యుత్ అధికారుల్లో మార్పు రావడం లేదు. నిబంధనలు విరుద్ధంగా విద్యుత్ తీగలను ఏర్పాటు చేసి పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో ఇళ్లపై నుంచి హైటెన్షన్ విద్యుత్ తీగలతో పాటు, 11 కేవీఏ లైన్లు ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల ప్రజలు ఎప్పుడు ఏ ప్రమాదం చోటుచేసుకుంటుందోనని భయాందోళనకు గురవుతున్నారు. ఈదురుగాలులు, ఉరుములు, మెరుపుల సమయంలో బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీస్తున్నారు. అదేవిధంగా వ్యవసాయ పొలాల్లో ఎన్నో ఏళ్ల కిందట పాతిన స్తంభాలు శిథిలావస్థకు చేరాయి. ఎల్‌టీ లైన్లు కిందకు వేలాడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పొలాల్లో రైతులు విద్యుత్ లైన్లకు కర్రలను సపోర్టుగా పెట్టారు.

కాలనీలపై 11 కేవీఏ లైన్లు..

మండల కేంద్రంలోని మడ్డవోనిపంపు ఎస్సీ కాలనీలో నుంచి ఉన్న హైటెన్షన్ విద్యుత్ లైన్ మరింత ప్రమాదకరంగా మారింది. బలమైన గాలులు వీచినప్పుడు జంపర్ల వద్ద మంటలు చెలరేగుతున్నాయని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మర్రిపల్లిలో బీసీ కాలనీలో 11 కేవీఏ విద్యుత్ లైన్ ఇళ్లపైనే దర్శనమిస్తున్నాయి. దాసర్లపల్లిలో ఎన్నో ఏళ్లుగా ఇళ్లపై నుంచి 11 కేవీఏ లైన్ ఉండటంతో గ్రామస్తులు ఇబ్బంది పడుతున్నారు. ఉప్పునుంతల ఎస్సీ కాలనీ, తిర్మలాపూర్, తిప్పాపూర్, వెల్టూరు తదితర గ్రామాల్లో గ్రామాల్లో విద్యుత్ లైన్లు ఇళ్లపై నుంచి ఏర్పాటు చేశారు. ట్రాన్స్‌ఫార్మర్లకు ఎలాంటి కంచెలేకుండా ఏర్పాటు చేయడంతో ఆయా గ్రామాలు ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

చేతులకు అందే ఎత్తులో..

వ్యవసాయ పొలాల్లో విద్యుత్ లైన్లు మరింత ప్రమాదభరితంగా ఉన్నాయి. రైతులకు పొలాల్లో ఉన్న వ్యవసాయ బోరు మోటర్ల వద్దకు ఏర్పాటు చేసుకున్న విద్యుత్ లైన్లు సరిగాలేవు. గుట్టమీదితాడా సమీపంలోని వ్యవసాయ పొలంలో కరెంట్ తీగలు పూర్తిగా కిందకు వేలాడుతున్నాయి. చేయికి అందే ఎత్తులో తీగలు ఉండటంతో గిరిజన రైతులు లైన్ కింద నుంచి ఒంగి వెళ్తున్నారు. ఉప్పునుంతల నుంచి కొత్త రాంనగర్ వెళ్లే దారి పక్కన బల్మోని బావి వద్ద రైతులు కొన్నేళ్ల నుంచి రైతులు కర్ర స్తంభాబాలపైనే విద్యుత్ తీగలు అమర్చుకొని మోటార్లు నడుపుకోవాల్సిన దుస్థితి నెలకొంది. ప్రతి గ్రామంలోని వ్యవసాయ పొలాల్లో కర్రలపై కరెంట్ లైన్లు దర్శనమిస్తున్నాయి. సంబంధిత ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ప్రమాదభరితంగా ఇళ్లపై నుంచి ఉన్న విద్యుత్ లైన్‌లను మార్పు చేయడంతోపాటు ఇళ్ల మధ్యలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను ఊరి వెలుపలికి మార్చాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

> **సమస్య పరిష్కారానికి కృషి**
>
> కాలనీలు, ఇళ్లపై ఉన్న విద్యుత్ లైన్లు మార్చడానికి శాఖాపరంగా ప్రొవిజన్ లేదు. ఒకవేళ సంబంధిత కాలనీ వాసులు, ఇళ్ల యజమానులు లైన్ మార్పిడికి అయ్యే ఖర్చు భరిస్తే ప్రతిపాదనలు తయారుచేసి విద్యుత్ లైన్‌ను మార్పిడికి అవకాశం ఉంది. విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా.
>
> – డిస్కం ఏఈ అమర్‌సింగ్, ఉప్పునుంతల

సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలి



అచ్చంపేట మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

నాగర్‌కర్నూల్‌రూరల్: ఈనెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి జి అశోక్ కోరారు. ఈ సందర్భంగా శనివారం కార్మికులతో కలిసి ఆయన సివిల్ సప్లయ్ ఏఓకు సమ్మె నోటీసును అందించారు. కనీస వేతనం రూ.26 వేలు అందించాలని, పెన్షన్ రూ.10వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హమాలీలు వెంకటయ్య, రామయ్య, కృష్ణయ్య, నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట: దేశ వ్యాప్తంగా ఈ నెల16న జరిగే సార్వత్రిక సమ్మెలో పాల్గొంటునట్లు శనివారం మున్సిపల్ కమిషనర్ శ్రీహరికి మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు కనీస వేతం రూ.26వేలు ఇవ్వాలని, కార్మికులను పర్మనెంట్ చేయాలని కోరారు. పారిశ్రామిక వివాదాల చట్టం 1947 సెక్షన్ 22 అండ్ ఒకటి ప్రకారం కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. మున్సిపల్ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న రెండు నెలల జీతం వెంటనే చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు పాండు, సాయిలు, సాయికుమార్, వెంకటయ్య, హుస్సేన్, కృష్ణమ్మ, రాములమ్మ, అలివేలు, కృష్ణమ్మ ఎల్లయ్య పాల్గొన్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

ఊర్కొండ: మహబూబ్‌నగర్ జిల్లా బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, జడ్చర్ల మాజీ ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి జన్మదిన వేడుకలను శనివారం మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక కోదాడ జడ్చర్ల జాతీయ రహదారిపై బీఆర్‌ఎస్ నాయకులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో పార్టీ మండల నాయకులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సంఖ్య పెంచాలి



చారకొండ: గ్రామాల్లో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని ఎంపీడీఓ వెంకటేష్ కోరారు. శనివారం మండలంలోని ఎర్రవల్లి, గోకారం గ్రామాల్లో పర్యటించి గ్రామాల్లో అభివృద్ధి పనులు పరిశీలించారు. క్షేత్రస్థాయిలో ఉపాధి పనులు చేస్తున్న కూలీలకు పలు సలహాలు సూచనలు ఇచ్చారు. కూలీలు చేపట్టిన పనిని సంబంధిత వివరాలను ఆన్‌లైన్‌లో పొందుపరచాలని సిబ్బందికి సూచించారు. రానున్న వేసవిలో కూలీలకు ఎలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. వారి వెంట ఏపీఓ లక్ష్మయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు ఉన్నారు.

కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రైతు సంఘం నాయకులు

నాగర్‌కర్నూల్‌రూరల్: కేంద్రం ప్రవేశపెట్టిన కేంద్ర బడ్జెట్‌ను సవరించాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక అంబేద్కర్ చౌరస్తా ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రైతులకు కేటాయించిన నిధులు ఏ మాత్రం సరిపోవని ఆవేదన వ్యక్తం చేశారు. గత సంవత్సరం కన్నా ఎరువులపై ఇచ్చే సబ్సిడీని భారీగా తగ్గించడం దారుణమన్నారు. దీంతో ఎరువుల ధరలు విపరీతంగా పెరుగుతాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పి మద్దతు ధరల విషయం ప్రస్తావించకపోవడం దుర్మార్గమన్నారు. తక్షణమే బడ్జెట్‌ను సవరించకపోతే ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు వెంకటేష్, నరేందర్ రెడ్డి, సత్యం, శివ, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి



కల్వకుర్తిరూరల్: అందరి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని ప్రత్యేకాధికారి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి ఆంజనేయులు అన్నారు. మండలంలోని మార్చాల గ్రామానికి ప్రత్యేకాధికారిగా నియమించిన ఆంజనేయులు శనివారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో గ్రామాభివృద్ధిపై చర్చించారు. ఈ సందర్భంగా గ్రామంలో చేపట్టాల్సిన పనులు, పురోగతిలో ఉన్న పనులపై ఆరాతీశారు. సిబ్బందితో సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం గ్రామస్తులు ప్రత్యేకాధికారి ఆంజనేయులును సత్కరించారు.

కార్మికుల హక్కుల పరిరక్షణకు పోరాడుతాం



మాట్లాడుతున్న ఆర్.శ్రీనివాసులు

కొల్లాపూర్: కార్మికుల హక్కుల పరిరక్షణకోసం సీఐటీయూ నిరంతరం పోరాడుతోందని జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్. శ్రీనివాసులు, ఉపాధ్యక్షుడు ఈశ్వర్ అన్నారు. శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ ప్రాంగణంలో వారు అంగన్‌వాడీ, ఆశావర్కర్లు, మున్సిపల్ వర్కర్లతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈనెల 16న నిర్వహించే దేశవ్యాప్త సమ్మెలో కార్మికులందరూ పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి దశరథం, ప్రజాసంఘాల నాయకులు మల్లేష్, చిట్టెమ్మ, నరసింహ్మ, శ్రీదేవి, లక్ష్మీ, గౌరమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



అచ్చంపేటలో మాట్లాడుతున్న రేణయ్య

కందనూలు: కేంద్రం ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలో మున్సిపాలిటీ ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని బీజేపీ టౌన్ అధ్యక్షుడు ఎలిమె రాము ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా రాజవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి కార్యకర్త గావ్ చలో అభియాన్ (పల్లెకు పోదాం అభియాన్) కార్యక్రమం విరివిగా నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి మాయని శ్రీశైలం నాయకులు యాదగిరి, పర్వతాలు, మండల అధ్యక్షుడు సుధీర్ గౌడ్, లక్ష్మారెడ్డి, పర్శరాములు, తదితరులు పాల్గొన్నారు.

అచ్చంపేట: గావ్ చలో అభియాన్(పల్లెకు పోదాం) కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ముక్తాల రేణయ్య కోరారు. శనివారం పట్టణంలో బీజేపీ ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ గ్రామానికి ప్రవాస్ కార్యకర్తలు వెళ్లి కేంద్రంలో పీఎం నరేంద్రమోదీ 10 ఏళ్ల పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వరికుప్పల అంజనేయులు, గిరిజన మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పత్యానాయక్, దేవేందర్‌రెడ్డి, అఖిల్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, గణేష్, రమేష్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే గౌరవం

కల్వకుర్తిరూరల్: విద్యతోనే సమాజంలో గౌరవం వస్తుందని సత్యసాయి సేవా సమితి మహిళా విభాగం సభ్యులు అన్నారు. శనివారం పట్టణంలోని కస్తూర్బా పాఠశాలలో విద్యార్థులకు విద్యా ప్రాధాన్యాన్ని వివరించారు. విద్యార్థులు భక్తిభావంతో మెలగాలన్నారు. ఈ సందర్భంగా ధ్యానం చేసే పద్ధతిపై అవగాహన కల్పించారు. ఉన్నతమైన విద్యను అభ్యసించడంతో పాటు ఉన్నతస్థాయికి చేరుకునేందుకు మెలుకువలు పాటించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

వెల్దండ: మండలంలోని బొల్లంపల్లి, బైరాపూర్ గ్రామాల్లోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏఈ సూర్యం శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. సబ్‌స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ



అచ్చంపేట: మండలంలోని నడింపల్లి ప్రాథమిక పాఠశాల విద్యార్థులు శనివారం స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులుగా వ్యవహరించి పాఠాలు బోధించారు. హెచ్‌ఎంగా సీహెచ్ ధర్వేష్, మరో 24 మంది విద్యార్థులు ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తించారు. ప్రతిభ కనబర్చిన వారికి బహుమతులు అందజేశారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు అర్జునయ్య, హెచ్‌ఎం శంకర్, శ్రీశైలం, జయమ్మ, వైడూర్య, స్వాతి పాల్గొన్నారు.

అనారోగ్యంతో యాచకురాలి మృతి

నాగర్‌కర్నూల్ క్రైం: అనారోగ్యంతో మహిళ మృతి చెందిన సంఘటన జిల్లా కేంద్రంలోని కొల్లాపూర్ క్రాస్‌రోడ్డు ఎదుట శనివారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ రాంచందర్‌జీ తెలిపిన వివరాల ప్రకారం లింగాల మండల కేంద్రానికి చెందిన కేతావత్ రాణి (38)యాచిస్తూ జీవనం గడుపుతోంది. జిల్లా కేంద్రానికి వచ్చి అనారోగ్యంతో మృతిచెందింది. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో మృతదేహాన్ని జనరల్ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ఆమెసోదరుడు శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జిల్లా సదస్సును విజయవంతం చేయండి



మాట్లాడుతున్న మారేడు శివశంకర్

నాగర్‌కర్నూల్‌రూరల్: ఏఐటీయూసీ జిల్లా కార్యాలయంలో ఈ నెల 4న నిర్వహించనున్న జాయింట్ ప్లాట్‌ఫాం ఆఫ్ ట్రేడ్ యూనియన్స్ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఆ సంఘం జిల్లా కార్యదర్శి మారేడు శివశంకర్ కోరారు. శనివారం ఆయన గుడిపల్లి, పెద్దాపూర్, నాగనూలు గ్రామాల్లో మధ్యాహ్న భోజన కార్మికులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. సదస్సుకు ముఖ్యఅతిథిగా ఏఐటీయూసీ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం నర్సింహ పాల్గొంటారని వివరించారు. తెలిపారు. అన్ని కార్మిక, అనుబంధ సంఘాలు, కార్మికులు, అసంఘటిత కార్మికులు, మున్సిపల్ కార్మికులు హమాలీ, ఉపాధి హామీ, రవాణా రంగ కార్మికులు, ఇతర సంఘాల కార్మిక సంఘాల నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంఘం నాయకులు శ్రీనివాసులు, తగిలి శ్రీనివాసులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్మీడియట్ ప్రవేశ పరీక్ష

వెల్దండ: మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం(సీఓఈ) కళాశాలల్లో చేరేందుకు ఆదివారం ప్రవేశపరీక్ష నిర్వహిస్తున్నట్లు శనివారం ప్రిన్సిపాల్ షకీలా సుల్తానా ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పరీక్ష ఉంటుందని పేర్కొన్నారు. మొత్తం 264 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

బాధ్యతలు చేపట్టిన ప్రత్యేకాధికారులు



లింగాల: సర్పంచుల పదవీ కాలం ముగియడంతో పంచాయతీల పాలనకు ప్రభుత్వం తాత్కాలికంగా ప్రత్యేకాధికారులను నియమించింది. శనివారం మండలంలోని పలు గ్రామ పంచాయతీలలో ప్రత్యేకాధికారులు బాధ్యతలు చేపట్టారు. సర్పంచుల నుంచి పంచాయతీ నిర్వహణకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను స్వాధీనం చేసుకున్నారు. మండలంలో 23 గ్రామ పంచాయతీలకు ఒక్కో అధికారి రెండు నుంచి మూడు పంచాయతీల బాధ్యతలు స్వీకరించారు. మండలంలోని అవుసలికుంట పంచాయతీలో తహసీల్దార్ ఉమ, లింగాల, అప్పాయపల్లి, దారారం పంచాయతీలలో మండల వ్యవసాయాధికారి నాగార్జునరెడ్డి బాధ్యతలను తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ గీతాంజలి, ఎమ్మార్వై సీతారాంనాయక్, ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు చంద్రయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు అన్యాయం

కొల్లాపూర్ రూరల్: ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్‌తో గిరిజనులకు అన్యాయం జరిగేవిధంగా ఉందని ఆ సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు శంకర్, అశోక్ అన్నారు. శనివారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గిరిజనులను ఆదుకోవడంలో కేంద్రం ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. 2023 బడ్జెట్‌లో గిరిజనుల అభ్యున్నతికి రూ. 8154 కోట్లు కేటాయించి అందులో రూ.1178 కోట్లు దారి మళ్లించారని ఆరోపించారు. 2024లో రూ.12460 కోట్లు కేటాయించి సవరించిన అంచనాలతో రూ.7605 కోట్లకు తగ్గించిందన్నారు. బడ్జెట్‌లో సముచిత న్యాయం చేయకుంటే గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ రంగంపై కేంద్రం వివక్ష

కొల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో వ్యవసాయ రంగం పట్ల వివక్ష చూపారని తెలంగాణ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బాలపీరు అన్నారు. కేంద్ర బడ్జెట్‌పై రైతు సంఘం నాయకులు శనివారం పట్టణంలోని గాంధీ విగ్రహం ఎదుట నిరసన తెలిపారు. నాగేష్, బాలకృష్ణ, శివశంకర్, రామకృష్ణ, బాలయ్య ఉన్నారు.

జెడ్పీటీసీకి సన్మానం

మన్ననూర్: అమ్రాబాద్ మండల జెడ్పీటీసీ డాక్టర్ అనురాధను మాజీ వైస్ ఎంపీపీ సంబు శోభ శనివారం మన్ననూర్‌లో కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకులు సన్మానించారు. మహిళా డాక్టర్స్ డే సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. సుజాత, జయమ్మ, అలివేల, పద్మజా, రామేశ్వరి, ప్రభావతమ్మ, మంజుల, నారమ్మ పాల్గొన్నారు.

సర్పంచ్, వార్డు సభ్యులకు ..

కోడేరు: మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీలో మాజీ సర్పంచ్, మాజీ వార్డు సభ్యులను పంచాయతీ కార్యదర్శి రవితేజ సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటస్వామి, సురేష్, శేఖర్‌రెడ్డి, నర్సింహ్మా, శివయ్య పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలి



లింగాల: అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించాలని డీఎల్‌పీఓ వెంకటయ్య ప్రత్యేక అధికారులకు సూచించారు. శనివారం మండలంలోని పలు గ్రామ పంచాయతీలను డీఎల్‌పీఓ సందర్శించారు. వేసవికాలంలో తాగునీటి సమస్య రాకుండా చూసుకోవాలన్నారు.

నూతన కమిటీ ఎన్నిక

కల్వకుర్తిరూరల్: భవన నిర్మాణ కార్మిక సంఘం మండల నూతన కమిటీని రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శిగా ప్రభాకర్, కోశాధికారిగా యాదయ్య, ఉపాధ్యక్షుడిగా రాజు, దర్శన్‌రెడ్డి, రాజుగౌడ్‌లు ఎన్నికయ్యారు.

కోఆర్డినేటర్‌గా రమేష్‌కుమార్

కొల్లాపూర్: పట్టణంలోని డాక్టర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్ కో ఆర్డినేటర్‌గా డాక్టర్ సి.రమేష్‌కుమార్ నియమితులయ్యారు. శనివారం ఆయనకు నియామక పత్రాలను ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ రామరాజుయాదవ్ అందజేశారు.

ఎంపీ టికెట్ మాదిగలకు ఇవ్వాలి

అమ్రాబాద్: నాగర్‌కర్నూల్ పార్లమెంట్ టికెట్ మాదిగలకు కేటాయించాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు కొయ్యలవెంకటేష్ మాదిగ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో ఆయన మాట్లాడుతూ అన్ని పార్టీలు ఎంపీటికెట్ మాదిగలను ఇవ్వాలని కోరారు.

గ్రామీణ వనరులపై అవగాహన



యత్మతాపూర్‌లో అవగాహన కల్పిస్తున్న రావేఫ్ విద్యార్థులు

తాడూరు: మండలంలోని యత్మతాపూర్‌లో గ్రామీణ ప్రాంతాలకు సంబంధించిన వనరులు, వ్యవసాయం, వివిధ అంశాలపై రావేఫ్ విద్యార్థులు శనివారం గ్రామస్తులకు అవగాహన కల్పించారు. కేవీకే పాలెం వ్యవసాయ కళాశాలలో చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు గ్రామీణ భాగస్వామ్య విశ్లేషణాత్మక సదస్సు నిర్వహించి రైతులకు, గ్రామస్తులకు చిత్రపటాలను గీసి వివరించారు. సోషల్ మ్యాప్, ట్రాన్సెక్టర్ వాక్, వనరుల చిత్రపటం, చపాతీ పటాలపై కాలానుగుణ క్యాలెండర్, కాలక్రమ మ్యాట్రిక్స్, ప్యాకింగ్ సమస్యల పటాల ద్వార గ్రామస్తులకు చూపించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రభాకర్‌రెడ్డి, డాక్టర్ రాజశేఖర్, సర్పంచ్ కుర్మయ్య, గ్రామస్తులు భాస్కర్‌రెడ్డి, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసాచారి, రైతులతో పాటు రావేఫ్ విద్యార్థులు నవత, సానియా, సింధూర, నివేదిత, ప్రవళిక, రమ్యలు పాల్గొన్నారు.